అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు


మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందచేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు రేషన్‌కార్డు లబ్ధిదారుల సర్వేలు నిర్వహిస్తుండడంతో గురువారం కొత్తపేట డివిజన్ వార్డు కార్యాలయంలో పర్యటించిన నాయికోటి పవన్‌కుమార్ కొత్తపేట డివిజన్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డు లబ్ధిదారుల తదితర అంశాలపై వార్డు ఇన్‌చార్జి మాధవ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. డివిజన్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు మొత్తం 6,600 వరకు లబ్ధిదారుల జాబితాలు వచ్చాయని, వాటిలో 3 వేల 600 వరకు సర్వేలు నిర్వహించడం జరిగిందని మాధవరెడ్డి కార్పొరేటర్ తెలియజేశారు. మిగతా 3 వేలమంది లబ్ధిదారుల పరిశీలన మిగిలిఉందని అన్నిచోట్ల సర్వేలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. నూతన రేషన్‌కార్డుల లిస్టులు కూడా వచ్చాయని అవి కూడా వెరిఫికేషన్ చేస్తున్నామని తెలియజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పవన్‌కుమార్ కొత్తపేట డివిజన్ పరిధిలో పేద ప్రజలు ఉన్నారని అర్హులైన ప్రతి ఒక్కరికి సంప్రదించి వాళ్లకు ఇల్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. చాలా మంది రేషన్ కార్డు లేక ఎన్నో సంవత్సరాల నుంచి ఇబ్బందులు పడుతున్నారని, వారికి రేషన్ కార్డులు మంజూరు చేసేలా చూడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు హరిప్రసాద్, సహదేవ్, శివ, బీజేపీ నాయకులు మంచి రాజేష్ జంగారెడ్డి, సత్యనారాయణ, నిరంకి రవి, తోట మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి జీవశాస్త్ర టాలెంట్ పరీక్ష విజయవంతం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఎల్బీనగర్: తెలంగాణ బయోసైన్స్ ఫోరం రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సాహెబ్‌నగర్ జిల్లా పరిషత్ స్కూల్ వేదికగా గురువారం జరిగిన జిల్లా స్థాయి జీవశాస్త్ర టాలెంట్ పరీక్ష విజయవంతంగా ముగిసింది. తెలుగు, ఇంగ్లిషు మీడియం మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్ మూడు విభాగాలలో పరీక్షను నిర్వహించగా రంగారెడ్డి జిల్లాలోని 27 మండలాల నుంచి అత్యధిక సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. 30 బహుళ ఐచ్ఛిక ప్రశ్నలతో 45 నిమిషాల సమయంతో నిర్వహించిన ఈ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభను చూపి ఉత్తమ మార్కులను సాధించి వివిధ స్థానాలలో విద్యార్థులు నిలిచారు. రంగారెడ్డి జిల్లా బయోసైన్స్ ఫోరం అధ్యక్షులు రావుల రాజమల్లేశ్ అధ్యక్షతన నిర్వహించిన ముగింపు సభలో పాల్గొన్న పలువురు మాట్లాడుతూ జీవశాస్త్రాన్ని ఇష్టంతో చదివి డాక్టర్లు, వ్యవసాయ శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన పలువురు విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి వై.శ్రీనివాసరావు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిధర్, డీసీఈబీ సెక్రటరీ జనరల్ అరుణ్, సాహెబ్‌నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దినేష్, రాధాశ్రీ ష్టారెడ్డి, బయోసైన్స్ ఫోరం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనమల ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎంపీకి క్రాంతిహిల్స్ కాలనీవాసుల వినతి

వనస్థలిపురం: తమ కాలనీలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ వనస్థలిపురం డివిజన్ క్రాంతిహిల్స్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు గురువారం మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో సీసీ కెమెరాలు, పార్క్ అభివృద్ధి, సీనియర్ సిటిజెన్స్ కోసం భవనం నిర్మించాలని ఎంపీని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బద్దం రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి కంచర్ల సత్తిరెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి మనోహర్, గౌరవ అధ్యక్షుడు యాదగిరిరెడ్డి, రామానుజరెడ్డి, బిక్షపతి, మల్లేశం, నాయకులు నూతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఈటలతో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు

పేద రోగులను ఆదుకునేందుకు కృషి


బాధితురాలికి చెక్కును అందజేస్తున్న కిరణ్ కుమార్‌రెడ్డి

హస్తినాపురం: వైద్య ఖర్చుల కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని ఆదుకునేందుకు తమ శాయశక్తులా కృషి చేస్తామని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అసెంబ్లీ కౌన్సిల్ మెంబర్ బొమ్మిడి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని రోషన్‌దౌలా బస్తీకి చెందిన బీజేపీ కార్యకర్త నరేష్ కొన్నిరోజులుగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతుండగా విషయం తెలుసుకున్న కిరణ్‌కుమార్‌రెడ్డి తన సేవా సంస్థ ద్వారా నరేష్ చికిత్స నిమిత్తం వైద్యానికి అయ్యే ఖర్చుకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, అరుణ మన్కోటియా, పి.శిరీషరెడ్డి, పి.బాలరాజు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు

కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి


పనులను ప్రారంభిస్తున్న కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్‌లో ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధి ఆగమయ్యనగర్‌కాలనీలో రూ.20.30 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైకాలనీల నుంచి వచ్చే వరదనీటితో ఆగమయ్యనగర్‌కాలనీ బురదమయంగా మారుతుందని, సీసీ రోడ్డు ఏర్పాటుతో దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించానని తెలిపారు. డివిజన్‌లో కొన్ని ప్రాంతాలు వరద ముంపునకు గురైతున్నాయని, నూతన బడ్జెట్‌లో నిధులు మంజూరు చేయించి సమస్యను పరిష్కరిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కృష్ణారెడ్డి, వెంకటచారి, శ్రీరాములు, జనార్థన్‌రెడ్డి, సుజాత, వసంతి, సతీష్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించటంలో ముందుంటా

డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని శ్రీకృష్ణాహిల్స్, సీఎస్ఆర్‌కాలనీ, శివగంగా కాలనీలలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి మార్నింగ్‌వాక్ చేపట్టి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడు ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లె భూపాల్‌రెడ్డి, మెంగ సత్తిపండు, రవీందర్‌రావు, లింగయ్య, శ్రీనివాస్‌గౌడ్ నాయకులు సాయిరాంగౌడ్, యాదగిరి యాదవ్ పాల్గొన్నారు.

నాలా పనులపై విజిలెన్స్‌తో విచారణ జరిపించాలి

కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి


జీహెచ్ఎంసీ అధికారులను ప్రశ్నిస్తున్న శ్వేతమధుకర్‌రెడ్డి

సైదాబాద్: నాలా నిర్మాణం పూర్తవ్వకుండానే కాంట్రాక్టర్‌కు జీహెచ్ఎంసీ అధికారులు రూ. 90 లక్షల బిల్లులు చెల్లించారని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి ఆరోపణలు చేశారు. 11 నెలల క్రితం పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ నాలా నిర్మాణంలో ఐదుశాతం పనులు కూడా పూర్తి చేయలేదన్నారు. ఈ అవినీతి ఉదంతంపై విజిలెన్స్ విచారణ కోరుతామని కార్పొరేటర్ తెలిపారు. గురువారం డివిజన్ పరిధిలోని డీఎస్‌నగర్‌లో ఆమె జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే డీఎస్‌నగర్ బస్తీ ముంపునకు గురయ్యేదని తెలిపారు. సమస్యకు శాశ్వత పరిష్కారంగా అధికారులతో ప్రతిపాదనలు పూర్తి చేసి నాలా పునర్నిర్మాణ పనులు మంజూరు చేయించామని వివరించారు. అయితే సదరు కాంట్రాక్టర్ కొంతమేరకే పనులు చేస్తే బిల్లులు మంజూరు అయినట్లు తమకు తెలిసిందన్నారు. ఈ విషయమై విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

నేడు పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ

మహేశ్వరం: మండల పరిధి డబిల్‌గూడ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయ 11 గంటలకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నామని సంఘం గ్రామ అధ్యక్షుడు, విగ్రహ దాత అల్వాల చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ గౌడ్‌లు గురువారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ తదితరులు రానున్నారని పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు అందరూ హాజరు కావాలని కోరారు.

అడ్డగోలు పార్కింగ్‌లతో ట్రాఫికర్!

- షాపింగ్ మాల్స్, వైన్స్‌ల వద్ద పార్కింగ్ వసతి కరువు
- రోడ్లపై పార్కింగ్‌లతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం
- ఇబ్బందులుపడుతున్న వాహనదారులు


వనస్థలిపురం రైతు బజారు కూడలిలో ట్రాఫిక్‌జాం ఏర్పడిన దృశ్యం

వనస్థలిపురం: వాణిజ్యపరంగా దినదినాభివృద్ధి చెందుతున్న వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్‌లలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతోంది. వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్‌ల ప్రధాన రహదారులలో పేరొందిన కంపెనీలకు చెందిన షోరూంలు, కార్పొరేట్ కళాశాలలు, స్కూళ్లు, బ్యాంకులు, హోటళ్లు, పలు వాణిజ్య సముదాయాలు ఏర్పడడంతో రద్దీ ప్రాంతాలుగా మారాయి. అయితే వాణిజ్య సముదాయాలు, బ్యాంకులు, వైన్స్‌లకు సరైన పార్కింగ్ వసతి లేకపోవడంతో వాటి దగ్గరకు వచ్చే తమ వాహనాలను రోడ్లపైనే అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ఆ దారిన వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

- వనస్థలిపురం ప్రధాన రహదారిలో ఉన్న పోలీసు స్టేషన్ ఎదుట స్టేషన్‌కు వచ్చేవారు, సిబ్బంది తమ వాహనాలను రోడ్డుపైనే రెండు వరుసల్లో పార్కింగ్ చేస్తుండడంతో రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ బ్యాంకు వద్ద ఇదే పరిస్థితి. బ్యాంకుకు వచ్చే ఖాతాదారులు బ్యాంకుకు సరైన పార్కింగ్ వ్యవస్థ లేకపోవడంతో తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రోజూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది.
- వనస్థలిపురం ప్రధాన రహదారిలో ఉన్న పాఠశాలల వద్ద కూడా తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. విద్యార్థులను తీసుకెళ్లడానికి వచ్చే ద్విచక్ర వాహనాలు, ఆటోలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండడంతో బస్సులు, ఇతర వాహనాలు వెళ్లడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంక్ వద్ద మూడు వైపుల నుంచి వచ్చే వాహనాలు జిగ్‌జాగ్‌గా వెళుతుండడంతో తరుచుగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడంతో వాహనదారులు ఇష్టారీతిన వెళుతున్నారు.


వనస్థలిపురం గణేష్ టెంపుల్ వద్ద రాత్రివేళ ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

- వనస్థలిపురం రైతుబజారు వద్ద నాలుగు రోడ్ల కూడలిలో ఇదే పరిస్థితి. నాలుగు వైపుల నుంచి వాహనాలు జిగ్‌జాగ్‌గా వెళుతుండడంతో ట్రాఫిక్ సమస్య, ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణకు నిత్యం సిబ్బందిని పెట్టాల్సిన అవసరం ఉంది.
- వనస్థలిపురం గణేష్ టెంపుల్ నుంచి బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా వరకు రాత్రి వేళ నిత్యం ట్రాఫిక్ జాంలు ఏర్పడుతున్నాయి. ఆయా వ్యాపార సంస్థల ముందు వాహనదారులు తమ వాహనాలను అడ్డగోలుగా పార్కింగ్ చేస్తుండడంతో రోడ్డు కుంచించుకపోయి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- బీఎన్‌రెడ్డినగర్ చైతన్యనగర్‌లో బీడీరెడ్డి గార్డెన్ సమీపంలోని తెలంగాణ చౌరస్తాలో తరచూ ట్రాఫిక్‌జాంలు ఏర్పడుతూ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణకు సరైన సిబ్బంది లేకపోవడంతో వాహనదారులే వాహనాలను క్రమబద్ధీకరించుకోవాల్సిన పరిస్థితి.

స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం...

వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్‌లలో రోడ్లపై పార్కింగ్‌లతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్న విషయం నిజమే. పార్కింగ్ సదుపాయం లేని వాణిజ్య భవనాలకు జీహెచ్ఎంసీ అధికారులు యథేచ్ఛగా అనుమతులు ఇస్తున్నారు. ఇప్పటికే పలు షాపింగ్‌మాల్స్, వైన్స్‌ల వారికి నోటీసులు ఇచ్చాం. రోడ్లపై పార్కింగ్ చేసే వాహనాలకు జరిమానా వేస్తున్నాం. తరచుగా స్పెషల్ డ్రైవ్ చేపడుతూ రోడ్డు ఆక్రమణలను తొలగిస్తున్నాం. జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూడా మాకు సహకరించాల్సి వుంది.

–గట్టుమల్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, వనస్థలిపురం

బీసీ హక్కుల సాధన సమితి సమావేశాన్ని జయప్రదం చేయాలి


నాగోలు: వరంగల్‌లో ఈనెల 31న జరిగే బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడులు గురువారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరగబోయే జనగణనలో కులగణన చేపట్టాలని తద్వారా ఏఏ కులాలకు సంబంధించిన స్పష్టమైన సంఖ్య ప్రభుత్వం దగ్గరకు వచ్చిందని తద్వారా ఆయా కులాల జనాభా నిష్పత్తి ప్రకారం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. అలాగే బడ్జెట్లోని నిధులను విద్య, వైద్య, ఉద్యోగాల కోసం కేటాయించాలన్నారు. దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు కేంద్రంలో మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని దశాబ్దాల తరబడి విజ్ఞప్తి చేస్తున్నా పాలకుల చెవికి ఎక్కడం లేదన్నారు. బీసీల పరిష్కారం కోసం చేపట్టబోయే పోరాట కార్యక్రమాల కోసం ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర ఆఫీసు బేరర్లు తెలంగాణలోని 33 జిల్లాల అధ్యక్షులు కార్యదర్శులు కోశాధికారులు ఆయా జిల్లాల కన్వీనర్లు 31వ తేదీ ఉదయం 10:30 గంటలకు వరంగల్‌లోని శివనగర్‌లో ఉన్న సీపీఐ కార్యాలయం తమ్మెర భవన్‌కు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

వక్ఫ్‌బోర్డు స్థలాల సంరక్షణకు చర్యలు



సైదాబాద్: మాదన్నపేట ఈద్గా ఎదుట ఉన్న వక్ఫ్‌బోర్డు స్థలం, శ్మశానవాటికల సంరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజాముల్లా తెలిపారు. గురువారం ఆయన యాకత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్‌తో కలిసి స్థలాలను పరిశీలించారు. మాదన్నపేటలోని వక్ఫ్‌బోర్డ్ స్థలాన్ని కొందరు కబ్జాచేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని పలువురు ప్రజాప్రతినిధుల నుంచి తమకు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఇక్కడి స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

మరణించి ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపిన రైతు


అంజయ్య (ఫైల్‌ఫొటో)

మన్సూరాబాద్: మరణించిన తరువాత కూడా ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు ఓ రైతు. జీవన్‌ధాన్ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం మాణిక్యాలగూడెం గ్రామానికి చెందిన బంటు అంజయ్య (62) రైతు. ఈ నెల 14న ఉదయం తెల్లవారుజామును తన సైకిల్‌పై వెళుతుండగా గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో అంజయ్య తలకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స అందించిన కామినేని వైద్యులు ఈ నెల 22న బ్రెయిన్ డెడ్ అయినట్లు ప్రకటించారు. విషయం తెలుసుకున్న జీవన్‌ధాన్ ప్రతినిధులు ఆంజయ్య భార్య రుక్కమ్మతో పాటు కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించి లివర్, రెండు కిడ్నీలు, రెండు కార్నియాలను జీవన్‌ధాన్‌కు సేకరించింది.

ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ప్రమాదాలు జరగవు


అవగాహన కల్పిస్తున్న ఆర్టీఓ అధికారులు

నాగోలు: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ప్రమాదాలు జరగవని, అందుకే విద్యార్థులు ట్రాఫిక్ నిబంధలు తెలుసుకోవాలని నాగోలు ఆర్టీఓ అధికారులు జ్ఞానేశ్వర్, వేణు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా గురువారం న్యూ నాగోల్‌లోని శాంతినికేతన్ టాలెంట్ స్కూల్‌లో రోడ్డు భద్రతలు– రోడ్డు ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనర్లు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడపవద్దని ఒకవేళ నడిపిన సమయంలో ఏదైనా ప్రమాదాలు సంభవిస్తే తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని విద్యార్థులకు సూచించారు. తామిస్తున్న ఈ అవగాహనలు భవిష్యత్తులో మీకు ఎంతో ఉపయోగపడతాయని వారు అన్నారు. ముఖ్యంగా పాఠశాలల బస్సులను ఎక్కే సమయం, దిగిపోయే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకొని ప్రమాదాల బారిన పడకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థి దశలో రోడ్డు పద్ధతి నియమ నిబంధనలను అలవర్చుకున్నట్లయితే రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా ఉపయోగపడతాయని తెలిపారు. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కార్లను నడిపేవారు తప్పకుండా సీట్ బెల్ట్‌ను పెట్టుకోవాలని సూచిస్తూ మద్యం సేవించి వాహనాలు నడపడం నేరం ప్రమాదకరమని దీనిని మీ తల్లిదండ్రులకు బంధుమిత్రులతో కూడా చర్చిస్తూ ప్రమాదాల నివారణ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు ప్రసాద్, మురారి, అభిలాష్, మహేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందజేయాలి


రైతు భరోసా మార్గదర్శకాలను విడుదల చేస్తున్న లచ్చిరెడ్డి తదితరులు

ఎల్‌బీనగర్: అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్ సీతారామాంజనేయ కళ్యాణ మండపంలో ప్రజాపాలనలో భాగంగా నిర్వహించిన రైతు భరోసా కార్యక్రమానికి కార్పొరేటర్ లచ్చిరెడ్డి, హయత్‌నగర్ తహసీల్దార్ జానకి, అగ్రికల్చర్ అధికారి సులేమాన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు అర్హులైన వారందరికి ఈ పథకాలను అందజేయాలని అన్నారు. సాగుచేసే భూములకు మాత్రమే రైతు భరోసా నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుందని, అందుకు సంబంధించిన పథకాల మార్గదర్శకాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ శ్వేత, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌యాదవ్, రమేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మోసకారుల మాటలు నమ్మి మోసపోవద్దు

అటవీశాఖ అధికారి విజయానంద్


మాట్లాడుతున్న అటవీశాఖ, రెవెన్యూ అధికారులు

మన్సూరాబాద్: మోసకారుల మాటలు నమ్మి మోసపోవద్దని శంషాబాద్ అటవీశాఖ డివిజన్ అధికారి అధికారి విజయానంద్, సరూర్‌నగర్ మండల తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. హరిణి వనస్థలి జాతీయ పార్కులో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మన్సూరాబాద్ గ్రామ సర్వే నెంబర్ 7లోని 582 ఎకరాల స్థలం అటవీశాఖదని, కొంతమంది గత కొన్నేళ్లుగా గిఫ్ట్ డీడ్, నోటరీలు, సెల్‌డీడ్‌ల పేరుతో అమాయకులను మోసం చేస్తూ అమ్మకాలు చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. వారసత్వ ఆస్తిగా వచ్చిందని యూసుఫ్‌ఖాన్‌తో పాటు ఆయన భార్య తులసమ్మ అలియాస్ సుల్తానా అమాయకులకు నోటరీలు చేస్తూ విక్రయిస్తూ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఫారెస్ట్ స్థలంలో ఏలాంటి ప్లాట్లు లేవని, ఎవరూ కూడా కొనుగోలు చేసి మోసపోవద్దని కోరారు. ఫారెస్ట్ స్థలంలోని వస్తే అటవీశాఖ చట్టం ప్రకారం కఠిన చర్యలుంటాయని, జైలుకు వెళ్లే పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సాయిప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు సుభాష్ చంద్రబోస్ ఆదర్శం


నివాళులు అర్పిస్తున్న బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి

చంపాపేట: స్వాతంత్ర్య సమరయోధుడు, దేశం కోసం అహర్నిశలు శ్రమించిన అలుపెరగని ధీరుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేటి యువతకు ఆదర్శమని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని చంపాపేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి కోరారు. గురువారం సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా డివిజన్ పరిధిలోని మారుతీనగర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై చంద్రబోస్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. డివిజన్ కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు రమేష్, జనార్థన్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, నవీన్, సత్యనారాయణ, సత్తయ్య, నాయకులు వినోద్, రాజేష్, అంజి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పథకాల సర్వే


డీసీ జయంత్, మలక్‌పేట

చాదర్‌ఘాట్: ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పాటు, రేషన్‌కార్డుల దరఖాస్తుల వెరిఫికేషన్ సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని మలక్‌పేట జీహెచ్ఎంసీ సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ జయంత్ వెల్లడించారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన సమయంలోపే ఈ సర్వేను పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. దరఖాస్తుదారులు తమ దరఖాస్తులు ఇచ్చిన ఫోన్‌నెంబర్ వివరాలు ఇతర వివరాల్లో చిన్న, చిన్న తప్పులు దొర్లాయన్నారు. ఈ కారణం చేతనే అనుకున్న స్థాయిలో సర్వే పూర్తి కాలేదని చెప్పారు. దరఖాస్తుల పరిశీలనలో తమవైపు నుంచి ఎలాంటి పొరపాటు జరగలేదని అభిప్రాయపడ్డారు. సర్కిల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు 3976 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 2796 దరఖాస్తుల వెరిఫికేషన్ పూర్తి చేశామన్నారు. రేషన్‌కార్డులకు 2736 దరఖాస్తులు రాగా.. వాటిలో 1675 పూర్తి చేశామని తెలిపారు.

ఎమ్మెల్యేకు పరామర్శ

మన్సూరాబాద్: వెన్నెముకకు శస్త్ర చికిత్స చేయించుకుని గచ్చిబౌలిలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, జీవీసాగర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఎమ్మెల్యే త్వరగా కోలుకుని ప్రజాసేవలో మరింత ఉత్సాహంగా కొనసాగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జక్కిడి రఘువీర్‌రెడ్డి, టంగుగూరి నాగరాజు, జగదీశ్‌గౌడ్, చంద్రమోహన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

డ్రైవింగ్ స్కూల్ కార్ల ర్యాలీ

మలక్‌పేట: డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందుతున్న వారికి రోడ్డు భద్రతా నిబంధనలపై తప్పకుండా అవగాహన కల్పించాలని ఈస్ట్‌జోన్ మలక్‌పేట ఆర్టీవో లెక్కల కిష్టయ్య నిర్వాహకులకు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతావారోత్సవాల్లో భాగంగా గురువారం డ్రైవింగ్ స్కూల్ కార్లతో నిర్వహించిన ర్యాలీ ప్రారంభించారు. విలువైన ప్రాణాలు కాపాడుకోవడానికి అందరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని కోరారు. ఎంవీఐలు నరేంద్రపాల్‌సింగ్, రాధిక, రమేష్‌బాబు, బలరామ్, ఏఎంవీఐలు జాన్, అశ్రఫ్‌ఖాన్, మధుసూదన్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్య సంరక్షణ

లింగోజిగూడ: ఆరోగ్య పరిరక్షణకు వ్యాయాయం ఎంతో అవసరమని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధి అధికారినగర్‌కాలనీలో రూ.10లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జీమ్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ యువకులు, విద్యార్థులకు చదువుతో పాటు ఆట, పాటలు, చక్కటి ఆరోగ్యాన్ని కల్గి ఉండటం ఎంతో అవసరమని తెలిపారు. ప్రైవేటు జీమ్‌లకు వెళ్లాలంటే ఖర్చుతో కూడిన పనియని, అందుకు జీహెచ్ఎంసీ ఓపెన్ జీమ్‌లను ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌గౌడ్, మహేశ్వరీ, నరేష్, వినోద్, భాను, శివ, కాలనీవాసులు మైసయ్య, మహేందర్, .జంగయ్య, యాదగిరి, యాదమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

నాగోలు: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉప్పల్ మండల విద్యాధికారి రామారావు ఉపాధ్యాయులకు సూచించారు. నాగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న కాంప్లెక్స్ సమావేశాన్ని గురువారం ఎంఈఓ సందర్శించారు. ఎంఈఓ రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రతీ ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో ఉప్పల్ మండలం అన్ని అంశాలలో ముందుంచడానికి ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలని కోరారు. మండల నోడల్ అధికారి లక్ష్మీదేవి మాట్లాడుతూ నాగోలు డివిజన్ పరిధిలోని అన్ని పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ సెక్రటరీ ఆంజనేయులు, కాంప్లెక్స్ రిసోర్స్‌పర్సన్ బత్తుల శ్రీనివాస్ రెడ్డి, అనంతరెడ్డి వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి

ఎల్బీనగర్: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని సిరిపురం కాలనీలో రూ. 23 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కాలనీ ప్రతినిధులతో కలిసి కార్పొరేటర్ లచ్చిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు తన శాయశక్తులా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, చిగురింత సికింధర్‌రెడ్డి, బాకారం నర్సింహారెడ్డి, కల్లు విష్ణువర్ధన్‌రెడ్డి, మెండు పురుషోత్తం రెడ్డి, గోలి ప్రభాకర్‌రెడ్డి, గోలి సంజీవరెడ్డి, సత్తు వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.